క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత తీర్మానం



బాల్కొండ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మండలంలోని నాగాపూర్ రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు తీర్మాణ ప్రతిని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌కు వినతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 19వ వార్డుకు చెత్త సేకరణ బండిని పంపించాలని బీజేపీ కౌన్సిలర్ జీవీ నర్సింహారెడ్డి మున్సిపల్ మేనేజర్ హయామ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 20 రోజులుగా వార్డుకు చెత్తసేకరణ బండి రావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శ్రీనివాస్, సుంకరి రంగన్న, విజయానంద్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు..



రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) జీపీ కార్యదర్శి దీర్ఘకాలిక సెలవును మంజూరు చేయవద్దని గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీవో సురేష్ బాబుకు వినతిపత్రం అందచేశారు. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని, వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. కార్యదర్శి సెలవులను రద్దు చేయకుంటే ఇన్‌చార్జి కార్యదర్శిని నియమించాలని కోరారు.

కులం పేరుతో అవహేళన చేయొద్దు

బోధన్: బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ కోశాధికారి కొంద్ర వెంకటిని కులం పేరుతో అవహేళన చేస్తున్న ఆ కమిటీ ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని మాలమహానాడు, ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో ఆ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్, జిల్లా ప్రతినిధులు నీరడి రవి, శ్రావణ్‌కుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో మోస్తరు వర్షం

బోధన్: బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బోధన్ అర్బన్, రూరల్, సాలూరు, ఎడపల్లి, నవీపేట, రెంజల్, రుద్రూరు, పొతంగల్, మండలాల్లో సాయంత్రం నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల రోడ్లు జలమయంగా మారాయి.

మోర్తాడ్‌లో వైద్య శిబిరం

మోర్తాడ్: సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉపశమనం కల్పించడానికి మోర్తాడ్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కోటగిరిలో..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని పాత వ్యవసాయ సహకార సంఘం వద్ద ఆక్యుప్రెషర్, వివిధ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. కోటగిరి లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్, తేళ్ల రవి యువసేన సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22 వరకు శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పోల విఠల్ సేట్, గంగాధర్ దేశాయ్, పత్తి లక్ష్మణ్, రవికుమార్, నాయకులు, లయన్స్ క్లబ్, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

బోధన్‌టౌన్: మహిళలను కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్యే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సును అమలు చేస్తే సహించలేని కేటీఆర్ బస్సుల్లో మహిళలు డ్యాన్సులు చేస్తున్నారనడం సరైంది కాదన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, తలారి నవీన్ కుమార్, దాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీపౌర్ణమి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెంటిల్ కిడ్స్ పాఠశాలలో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లతా, కరస్పాండెంట్ గుజరాతి ప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆర్మూర్, బాల్కొండ బంద్

ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆర్మూర్, బాల్కొండ, ముప్కాల్ మండలాల బంద్‌కు హిందూ సంఘాలు శనివారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించి సహకరించాలని కోరారు.

ఇదెక్కడి చోద్యం

- డబుల్ బెడ్ రూం ఇళ్లకు రెండేళ్ల ఇంటి పన్ను వసూలు
- ఇళ్లు కేటాయించి ఏడాది గడవని వైనం
- ఆందోళనలో బాల్కొండ లబ్ధిదారులు



బాల్కొండలోని డబుల్ బెడ్ రూం ఇళ్లు

బాల్కొండ: ఇళ్లు లేని పేదలకు గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించింది. అందులో భాగంగా బాల్కొండ మండల కేంద్రంలో వంద మంది లబ్ధిదారులకు నిర్మించిన ఇళ్లను గత ఏడాది అక్టోబర్‌లో అప్పగించింది. కాగా వీరికి స్థానిక గ్రామ పంచాయతీ వారు రెండేళ్ల ఇంటి పన్ను కట్టాలంటు వసూలు చేస్తున్నారు. తమకు ఇళ్లను కేటాయించి ఏడాది కూడా గడవక ముందే జీపీ వారు ఇంటి పన్ను వసూలు కట్టాలంటు నోటీసులు అందజేస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది గడవక ముందే అధికారులు రెండేళ్ల ఇంటి పన్ను వసూలు చేస్తుండడంపై పలువురు ఇదెక్కడి చోద్యమని పెదవి విరుస్తున్నారు.

ఇంటి పన్ను ఎక్కువే..

డబుల్ బెడ్ రూం ఇళ్లకు అధికారులు ఇంటి పన్ను అధికంగానే వేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరానికి రూ. 1253 వేస్తే ప్రస్తుత సంవత్సరం రూ. 1315 వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇంటి పన్నును తగ్గించాలని, రెండు సంవత్సరాల ఇంటి పన్ను కాకుండా ప్రస్తుత సంవత్సర పన్నునే చెల్లించేలా చర్యల తీసుకోవాలని కోరుతున్నారు.

సౌకర్యాలు నిల్..

డబుల్ బెడ్ రూం ఇళ్లలో జీపీ నుంచి ఏర్పాటు చేసిన సౌకర్యాలు నిల్‌గానే ఉన్నాయి. తాగు నీటి, డ్రైయినేజీ సమస్య ఉందని ఆరు నెలలుగా చెబుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి సౌకర్యాలు లేకున్నా ఇంటి నంబర్లు కేటాయిస్తూ వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

దసరాకు ఇంటికి వచ్చాం



డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి గత దసరాకు వచ్చాం. కానీ ఏడాది గడవక ముందే రెండేళ్ల ఇంటి పన్ను కట్టాలని జీపీ వారు ఇబ్బంది పెడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – గంగాధర్, లబ్ధిదారుడు

పన్ను ఎక్కువగా వేస్తున్నారు



డబుల్ బెడ్ రూం ఇంటికి ఏడాదికి రూ. 1315 చొప్పున వేస్తున్నారు. ఇళ్లు లేక ఇన్నాళ్లు పూరి గుడిసెల్లో ఉన్నాం. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లపై ఇంత పన్ను వసూలు చేస్తే ఎలా కట్టాలి. ప్రభుత్వం ఆదుకోవాలి. – సాయన్న, లబ్ధిదారుడు

నిబంధనల ప్రకారమే ఇంటి పన్ను వసూలు

ప్రభుత్వ నిబంధనాల ప్రకారమే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పన్ను వసూలు చేస్తున్నాం. ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేయడం లేదు. ప్రతి ఇంటికి నంబర్లను కేటాయించాం. – రజనీకాంత్‌రెడ్డి, జీపీ కార్యదర్శి, బాల్కొండ

ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తే సహించం





బోధన్‌లో మాట్లాడుతున్న నీరడి ఈశ్వర్, రుద్రూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాలలకు వ్యతిరేకంగా మద్దతు పలికితే సహించబోమని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్ అన్నారు. పట్టణ శివారులోని బాబా గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన డివిజన్ స్థాయి వర్గీకరణ వ్యతిరేక సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తమ సంఘ జాతీయ కమిటీ రివ్యూ పిటిషన్‌దాఖలు చేసిందన్నారు. జిల్లా కార్యదర్శి నీరడి రవి, శ్రావణ్ కుమార్, దేవేందర్, సూర్యకాంత్, కొంద్ర వెంకటి, ఎడ్ల సంజీవ్, పాండు, డిస్కో సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు నిరసనగా ర్యాలీ

రుద్రూర్: ఎస్సీ వర్గీకరణకు నిరసనగా మండల కేంద్రంలో మాలమహానాడు నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వెంకటేశంకు అందజేశారు. కార్యక్రమంలో నీరడి ఈశ్వర్, నక్కరి సాయిలు, శ్యామ్, నవీన్, సాయిలు, కిశోర్, నర్సింలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ఆర్మూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వి ప్రభాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో భాగంగా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, బి దేవరాం, సార సురేష్, గంగాధర్, కిషన్, రమేశ్, సత్తెమ్మ, మల్లేశ్, రాజేశ్వర్, గుమ్ముల గంగాధర్, ఎం నరేందర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

నందిపేట ఎస్సైగా హరిబాబు



నందిపేట్: మండల నూతన ఎస్సైగా హరిబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్సై రాహుల్ నిర్మల్ జిల్లాకు బదిలీ కాగా భీమ్‌గల్ నుంచి హరిబాబు బదిలీపై వచ్చారు.

నవీపేట ఎస్సైగా వినయ్‌కుమార్

నవీపేట: మండల నూతన ఎస్సైగా వినయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఎస్సైగా విధులు నిర్వహించిన యాదగిరిగౌడ్ మోపాల్‌కు బదిలీ కాగా వేల్పూర్ నుంచి వినయ్‌కుమార్ నవీపేటకు బదిలీపై వచ్చారు.

బోధన్‌టౌన్: బోధన్ పట్టణ పీఎస్‌లో ఇద్దరు ఎస్సైలు మచ్చేందర్‌రెడ్డి, హమీబ్‌ఖాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్సైలను పోలీసు సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు.

బోధన్ రూరల్ ఎస్సైగా రాజశేఖర్



బోధన్‌రూరల్: బోధన్‌రూరల్ నూతన ఎస్సైగా ముక్కం రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు విధు లు నిర్వహించిన నాగనాథ్ వేల్పూర్‌కు బదిలీ కాగా కమ్మర్‌పల్లి నుంచి రాజశేఖర్ బదిలీపై వచ్చారు. అనంతరం ఎస్సైను సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి పూజలు



ఆర్మూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

ఆర్మూర్‌టౌన్/ బోధన్‌రూరల్: ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో వరలక్ష్మి పూజలను భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.



బోధన్‌లో..

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతం మహిళలు నిర్వహిస్తారు. బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లోని గ్రామాల్లో భక్తులు వరలక్ష్మి మాతకు ప్రత్యేక పూజలు చేశారు.

నేటి రైతు ధర్నాను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి శనివారం వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద తలపెట్టిన రైతు ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీని విస్మరించి కేవలం 25 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేశారని విమర్శించారు. బాల్కొండ నియోజకవర్గంలో 30 వేల మందికి రుణమాఫీ జరుగలేదన్నారు. రైతులు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అమ్దాపూర్‌వాసికి నేషనల్ అచీవర్స్ అవార్డు



అవార్డుతో సాయిలు సుభాష్

బోధన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ గురువారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఉత్తమ సామాజిక సేవలందించిన పలువురు ప్రతినిధులను ఎంపిక చేసి నేషనల్ అచీవర్స్ అవార్డులను ప్రదానం చేసింది. ఇందులో బోధన్ మండలంలోని అమ్దాపూర్‌కు చెందిన ఆ సంస్థ నియోజకవర్గ చైర్మన్ సాయిలు సుభాష్ అవార్డును అందుకున్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి బెజ్జారం చంద్రకుమార్, సంస్థ నేషనల్ చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు అవార్డు గ్రహీత శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్/ వర్ని(మోస్రా)/ రుద్రూర్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని మండలాల్లో బీజేపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఆర్మూర్, వర్ని, మోస్రా, రుద్రూర్‌లోని బీజేపీ కార్యాలయాల్లో పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

రుణమాఫీ చెక్కుల పంపిణీ

ఎడపల్లి: మండలంలోని జానకంపేట సింగిల్ విండోలో శుక్రవారం 87 మంది అర్హులైన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిన చెక్కులను విండో అధ్యక్షుడు మిద్దె నరేందర్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు, కార్యదర్శి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌లో గొల్ల, కుర్మలు నిర్మించిన మల్లన్న ఆలయంలో శుక్రవారం మల్లన్న విగ్రహన్ని ప్రతిష్ఠించారు. ఈ వేడుకలకు రాష్ట్ర కో–ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, మైక్‌సెట్ వితరణ

పెర్కిట్: ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు శుక్రవారం కంప్యూటర్, మైక్‌సెట్, బీరువాలను వితరణ చేశారు. పాఠశాలలో 1993–94లో పదో తరగతి చదివిన పెద్ది జ్ఞానేశ్వర్ తన తండ్రి పెద్ది రాజేశ్వర్ జ్ఞాపకార్థంగా రూ.40 వేల విలువగల ఐదు బీరువాలు, అలాగే అమెరికాలో స్థిరపడిన బండి కృష్ణ రూ.35 వేల విలువగల కంప్యూటర్, మిగతా విద్యార్థులు ఒక బీరువా, మైక్‌సెట్‌ను వితరణ చేశారు. పూర్వ విద్యార్థులకు హెచ్‌ఎం డి విశ్వనాథ్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

పొట్టిగుట్టలో వైద్య శిబిరం

వర్ని: మండలంలోని పొట్టిగుట్ట గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు మెగా హెల్త్ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజు, హెచ్‌వో రవి, వైద్యులు సుధాకర్, ఆండ్రూస్, పీహెచ్‌ఎన్‌వో కృష్ణవేణి పాల్గొన్నారు.

సన్మానాలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పీఎస్‌లో బదిలీపై వెళ్తున్న ఎస్సైలు అశోక్, హన్మాండ్లును ఎస్‌హెచ్‌వో రవికుమార్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సైలు గంగాధర్, అంజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈకి..

ఆర్మూర్ డివిజన్ పరిధిలో పలువురు జూనియర్ లైన్‌మన్‌లు ఏఎల్‌ఎంగా పదోన్నతి పొందారు. ఏఎల్‌ఎంలుగా పదోన్నతి కల్పించిన డీఈ హరిచంద్ నాయక్‌ను ఏఎల్‌ఎంలు సన్మానించారు. కార్యక్రమంలో నరేందర్ నాయక్, సల్ల శ్రీనివాస్ యాదవ్, సంజీవ్, నర్సయ్య, షకీల్, వేణుగోపాల్, అనిల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో ఎస్సై..

వేల్పూర్: మండలంలో నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నాగ్‌నాథ్‌ను వేల్పూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బద్దం హరికిషన్, దొమ్మేటి వెంకటేశ్‌గౌడ్, బాలు యాదవ్, నరేశ్‌రెడ్డి, ఏలేటి రంజిత్, రాకేశ్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి



రెంజల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై సాయన్న

రెంజల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సాయన్న సూచించారు. మండలంలోని కందకుర్తిలో శుక్రవారం స్థానికులతో సమావేశమై హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేస్తుందని, హెల్మెట్ లేకుంటే పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తోందని అన్నారు. యువకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దని సూచించారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి: వాహనదారులు హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్, బోధన్ రూరల్ నరేశ్ సూచించారు. మండల కేంద్రంలోని పీఎస్‌లో పలువురు ప్రయాణికులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై వంశీధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వర్నిలో..

వర్ని: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్సై కృష్ణకుమార్ సూచించారు. మండలంలోని జలాల్‌పూర్, జాకోర, బడా పహాడ్ గ్రామాల్లో ట్రాఫిక్ నియమాలపై శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. వాహనా లు నడిపేటప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, వాహన ధ్రువపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం



ముప్కాల్‌లో..



ఏర్గట్లలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి

మోర్తాడ్/ బాల్కొండ/ వర్ని/ రుద్రూర్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. బాల్కొండ, ముప్కాల్, మోర్తాడ్, ఏర్గట్ల, వర్ని, మోస్రా, రుద్రూర్ మండలాల్లోని ప్రధాన చౌరస్తాల్లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రుణమాఫీ చేసి చూపించాం

- హరీశ్‌రావు రాజీనామా చేయాలి
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఆగస్టు 15 నాటికి రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేశామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రుణ మాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీశ్‌రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణ మాఫీ దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తీయించారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ రాకుంటే జిల్లా అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ ముప్కాల్ మండల అధ్యక్షుడు సాగర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

సమాచారం..

నేడు ఓపీ సేవలు నిలిపివేత

పెర్కిట్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ ఆర్మూర్‌లో శనివారం ఔట్ పేషంట్ సేవలను నిలిపివేయనున్నట్లు ఆర్మూర్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి రాంగిరి భాను వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లైఫ్ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణాలు పోసే వైద్యురాలిపై పైశాచికంగా అత్యాచారానికి ఒడిగట్టడం హేయమైన చర్య అన్నారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నందిపేట్: నందిపేట్, మాక్లూర్ మండలాల విద్యుత్ వినియోగదారులకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ ఎం అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిపేటలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కోటగిరిలో బంద్ విజయవంతం

రుద్రూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు కోటగిరి మండల కేంద్రంలో బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఏముల నవీన్, ఉమాకాంత్ దేశాయ్, మామిడి శ్రీనివాస్, భూమయ్య, రాజు, పత్తి సతీష్, హన్మాండ్లు, మామిడి సాయిలు, గంగాధర్, శ్రీకాంత్, ప్రశాంత్, రమేష్ పాల్గొన్నారు.


మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	140
		లైవ్	100
స్కిన్‌లెస్	180	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,200	వెండి (కిలో)	86,800
22 క్యారెట్స్	67,525	– నిజామాబాద్ బిజినెస్	

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1	స్త్రీ-2(హిందీ) - 12.45, 4.00, 7.15 ఆయ్ (తెలుగు) -10.30
స్క్రీన్-2	మిస్టర్ బచ్చన్ (తెలుగు) - 9.00, 12.25, 03.50, 7.15, 10.40
స్క్రీన్-3	తంగలాన్ (తెలుగు) - 11.10, 5.45, 9.05 స్త్రీ-2(హిందీ) - 2.30
స్క్రీన్-4	డబుల్ ఇస్మార్ట్ (తెలుగు) - 09.10, 12.35, 4.00, 7.25, 10.50

నిజామాబాద్ నగరంలో..

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	డబుల్ ఇస్మార్ట్(తెలుగు)-10.25, 4.30,10.35 మిస్టర్ బచ్చన్(తెలుగు)-1.30,7.35
స్క్రీన్-2	స్త్రీ-2(హిందీ)- 10.30 తంగలాన్(తెలుగు)-1.30,7.35 ఆయ్(తెలుగు)-4.35,10.35
స్క్రీన్-3	మిస్టర్ బచ్చన్(తెలుగు)- 10.20,10.40 డబుల్ ఇస్మార్ట్ (తెలుగు)-1.25,7.30 స్త్రీ-2(హిందీ)- 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	డబుల్ ఇస్మార్ట్(తెలుగు)-9.00,7.05 మిస్టర్ బచ్చన్(తెలుగు)-12.25,10.30 స్త్రీ-2(హిందీ)-3.50
స్క్రీన్-2	మిస్టర్ బచ్చన్(తెలుగు)-9.10,7.15 డబుల్ ఇస్మార్ట్(తెలుగు)-12.35,10.40 కమిటీ కుర్రోళ్ళు(తెలుగు)- 4.00
స్క్రీన్-3	స్త్రీ-2(హిందీ)-9.50,1.05,10.40 ఖేల్ ఖేల్ మెయిన్(హిందీ)- 4.20 తంగలాన్(తెలుగు)-7.20
స్క్రీన్ -4	తంగలాన్(తెలుగు)-9.30, 12.50,4.10 ఆయ్(తెలుగు)-7.30 వేదా(హిందీ)- 10.35
దేవి	కమిటీ కుర్రోళ్ళు - 11.15 , 2.15 ఆయ్ (తెలుగు)-6.15,9.15
నటరాజ్	స్త్రీ-2(హిందీ)
విజయ్	మిస్టర్ బచ్చన్(తెలుగు)
లలితామహాల్	డబుల్ఇస్మార్ట్(తెలుగు)